జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి

# శ్వేత


JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 65॥ శనివారం ॥ 1-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

01 ఆగస్టు 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:45 తిథి తదియ రా. 11:04 వరకు తరువాత చవితి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం శతభిష రా. 8:33 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం శోభన రా. 11:18 వరకు కరణం వనిజ ఉ. 10:50 వరకు విష్టి రా. 11:04 వరకు వర్జ్యం తె. 3:23 నుండి తె. 5:02 వరకు దుర్ముహూర్తం ఉ. 7:41 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:46 వరకు యమగండం మ. 1:58 నుండి మ. 3:34 వరకు గుళికాకాలం తె. 5:59 నుండి ఉ. 7:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు మ. 1:09 నుండి మ. 2:50 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున





## నేడు ఏపీకి ప్రధాని మోదీ రాక

### భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం

### 17,900 కోట్ల పనులకు శ్రీకారం

**ప్రధాని మోదీ భోగాపురం పర్యటనపై ప్రధాన మంత్రి కార్యాలయం అధికారిక ప్రకటన విడు దల చేసింది. విజయనగరం జిల్లా భోగాపురంలో రేపు రూ.17,900 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల కు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న ట్లు వెల్లడించింది. రూ.5,640 కోట్ల వ్యయంతో నిర్మించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేస్తారని వెల్లడించింది. ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో విమానాశ్రయం నిర్మించినట్లు తెలిపింది. ఏఐ, బయోమెట్రిక్ ప్రాసెసింగ్, ఆటోమేటెడ్ బ్యాగేజీ సిస్టమ్, 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్ వంటి ఆధునిక సదుపాయాలు ఉన్నట్లు పేర్కొంది.**

విజయనగరం/అమరావతి, జూలై 31:రూ.460 కోట్లతో విశాఖపట్నంలో ఏర్పాటుచేసే ఆంధ్రప్రదేశ్ తొలి సెమీకండక్టర్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేస్తారని ప్రధాని కార్యాలయం వివరించింది. ఈ ప్లాంటులో ఏడాదికి 9.6 కోట్ల సెమీకండక్టర్ చిప్‌లు తయారవుతాయంది. రూ.5,550 కోట్లతో ఏర్పాటుచేస్తున్న కర్నూలు పునరుత్పాదక ఇంధన జోన్ విద్యుత్ ప్రసార వ్యవస్థ ప్రాజెక్టుకు మోదీ శంకుస్థాపన చేస్తారు. రూ.3,550 కోట్లతో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఏర్పాటైన సోలార్ - విండ్ ఎనర్జీ జోన్లు, రూ.820 కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అలాగే రూ.1,880 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుడతారు. ఈ రహదారి ప్రాజెక్టులతో విజయవాడలో ట్రాఫిక్ రద్దీతోపాటు విశాఖ – హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని వెల్లడించింది. దీంతోపాటు ప్రాంతీయ అనుసంధానం మెరుగుపడుతుందనే విషయాన్ని తరువాయి 2 వ పేజీలో...



## వందేమాతరాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు శిక్ష

**జాతీయ గేయం వందేమా తరంను అవమానిం చడం, ఆలాపనకు ఆటంకం కలిగించడం లేదా అడ్డుకోవడాన్ని నేరంగా పరిగణించే దేశ గౌరవానికి అవమానాలను నిరోధించే (సవరణ) బిల్లు--2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది.**

న్యూఢిల్లీ, జూలై 31 రా జ్యసభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లును గురువారం లోక్‌స భ కూడా ఆమోదించింది. దీంతో రాష్ట్ర పతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా అమ ల్లోకి రానుంది. ఈ చట్టం ప్రకారం వందేమా తరం గేయాన్ని ఉద్దేశపూర్వ కంగా అవ మానించినా, ఆలాపన సమయంలో ఆటంకం కలిగించినా లేదా అడ్డుకున్నా మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. లోక్‌సభలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అం శంపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు.



# టామ్‌కాం ద్వారా ఉపాధి.. పాస్‌పోర్టు సేవలు

**విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే యువతకు శిక్షణ, పాస్‌పోర్టు, ఉద్యోగ మేళా లు, విదేశీ ఉపాధి అవకాశాల కల్పన వరకు అన్ని బాధ్యతలను తెలంగాణ ఓవర్సీస్ మాన్‌ప వర్ కంపెనీ (టామ్‌కాం) చేపట్టేలా చర్యలు తీసుకో వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం శక్తి శాఖపై మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు వెల్లడించారు.**

### విదేశీ ఉద్యోగాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**విదేశీ భాషలు, డ్రైవింగ్ శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం**

**ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య విశ్వవిద్యాలయంపై సీఎం సమీక్ష**

**విద్యుత్ వాహనాలు, డ్రోన్ కోర్సులు ప్రవేశపెట్టాలని సూచన**

హైదరాబాద్, జూలై 31: విదేశాల్లో ఉద్యోగులకు సమస్యలు ఎదురైనా ప్రభుత్వం తరఫున చర్చించి న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విదేశాలకు కార్మికులను పంపించే ఏజెంట్ల వివరాలతో పాటు వారు పంపించే ప్రతి వ్యక్తి సమాచారాన్ని నమోదు చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణ కోసం (మిగతా 2వ పేజీలో)



## ఉద్యోగుల ఆరోగ్య ట్రస్ట్‌ను మరింత బలోపేతం చేయాలి

**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ (Employees Health Care Trust) పనితీరును మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.**

హైదరాబాద్, జూలై 31 శుక్రవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ సమావేశం జరిగింది. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆస్పత్రుల్లో అందుతున్న సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ, ఆరోగ్య పథకాన్ని నిరంతరం సమీక్షిస్తూ ప్రస్తుతం అమలులో ఉన్న చికిత్స ప్యాకేజీ రేట్లను సమగ్రంగా పునఃపరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను (మిగతా 2వ పేజీలో)



## ఫార్ములా-ఈ కేసులో తొలిసారి కోర్టుకు హాజరైన కేటీఆర్

**ఫార్ములా-ఈ రేసు కేసులో ఛార్జ్‌షీట్ దాఖలైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (కేటీఆర్) శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో తొలిసారిగా హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను న్యాయస్థానం ఆగస్టు 25కు వాయిదా వేసింది.**

హైదరాబాద్, జూలై 31 ఈ కేసులో మొదటి నిందితుడు (ఏ1)గా ఉన్న కేటీఆర్‌తో పాటు మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్. రెడ్డి కూడా కోర్టుకు హాజరయ్యారు. కేటీఆర్ రూ.1 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఇద్దరు ష్యూరిటీలను సమర్పించాలని కోర్టు (మిగతా 2వ పేజీలో)

## ఎల్లంపల్లి నిండడం కాంగ్రెస్ దూరదృష్టికి నిదర్శనం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



హైదరాబాద్, జూలై 31 శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం వరద జలాలతో పూర్తిస్థాయిలో నిండడం కాంగ్రెస్ ప్రభుత్వాల శాస్త్రీయ ప్రణాళిక, దూరదృష్టికి నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ పరిణామం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎన్నాళ్ళుగానో ప్రచారం చేస్తున్న వాదనలను పూర్తిగా తప్పుబట్టిందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా (మిగతా 2వ పేజీలో)



# పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళి

**అంతిమయాత్రలో ఇసుకేస్తే రాలనంత జనం... భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు**

**ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు.. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత**

హైదరాబాద్, జూలై 31 బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి (54) శుక్రవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ నెల 26న హనుమకొండలోని తన నివాసంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురికాగా, తొలుత రోహిణి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడం (పల్మనరీ ఎంబోలిజం) కారణంగా ఆయనకు గుండెపోటు వచ్చింది. వైద్యులు (మిగతా 2వ పేజీలో)

# ఎల్లంపల్లి నిండడం కాంగ్రెస్ దూరదృష్టికి నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారీ వరద ప్రవాహాల కారణంగా శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుందని తెలిపారు. అవసరమైతే మిడ్ మానేరు, లోయర్ మానేరు వంటి దిగువ జలాశయాలకు నీటిని నియంత్రితంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్ సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును శాస్త్రీయంగా రూపకల్పన చేసిందని మంత్రి చెప్పారు. గ్రావిటీ ఆధారిత వరద కాలువ వ్యవస్థ కారణంగా ఎలాంటి మోటార్లు లేదా లిఫ్టింగ్ వ్యవస్థ అవసరం లేకుండానే వరద జలాలు సహజసిద్ధంగా జలాశయంలోకి చేరాయని వివరించారు. గతంలో చేసిన తమ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కన్నెపల్లి పంప్ హౌస్‌లో మోటార్లు ఆన్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ఆందోళనను ప్రస్తావిస్తూ, ఎలాంటి పంపింగ్ లేకుండానే జలాశయం నిండిపోయిందని, దీంతో వారి వాదనలు నిరాధారమని తేలిపోయిందన్నారు. "మా వల్లే నీళ్లు వచ్చాయి" అనే వారి ప్రచారాన్ని ప్రకృతే తప్పు పట్టిందని వ్యాఖ్యానించారు.

మాజీ మంత్రి హరీశ్ రావు అవకాశం ఇస్తే నెల రోజుల్లో నీటిని ఎత్తిపోసి అందిస్తానని గతంలో ప్రకటించారని గుర్తుచేసిన మంత్రి, ఇప్పుడు ఎలాంటి ఎత్తిపోతల అవసరం లేకుండానే నీరు సహజంగా జలాశయానికి చేరిందని చెప్పారు. దీంతో గతంలో చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు.

బీఆర్ఎస్ ప్రతిపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషించకుండా, కరువు రావాలని, పంటలు దెబ్బతినాలని, ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకుంటున్నట్టుగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవడం, రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించడం కూడా ఆ పార్టీకి ఇబ్బందిగా కనిపించడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.



## నేటి రాశి ఫలాలు

**మేషం:** నూతన పనులకు శ్రీకారం చుడతారు. మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

**వృషభం:** చేపట్టిన పనులు ఆశాజనకంగా సాగుతాయి. నూతన పనులకు శ్రీకారం చుడతారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అదిగమించి ముందుకు సాగుతారు.

**మిధునం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. వ్యాపారాలలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటాబయటా ఒత్తిడులు పెరుగుతాయి. వృత్తి, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

**కర్కాటకం:** ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి వ్యాపారాలలో శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. మానసిక ప్రశాంతతకు పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

**సింహం:** ఇంటా బయట నూతన విషయాలు తెలుసుకుంటారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

**కన్య:** చిన్ననాటి మిత్రులను కలుసుకొని కష్టసుఖాలు చర్చిస్తారు. నూతన వాహనయోగం ఉన్నది. దీర్ఘకాలిక వివాదాల నుంచి బయటపడతారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి.

**తుల:** ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. నూతన ఋణయత్నాలు అనుకూలించవు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. దూరప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. వ్యాపార ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

**వృశ్చికం:** ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంపై అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు.

**ధనస్సు:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంతాన విద్యా ఉద్యోగ విషయంలో శుభవార్తలు వింటారు. మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. రాజకీయ వర్గాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది.

**మకరం:** కుటుంబ సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. ఆర్థికపరంగా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుంటాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు.

**కుంభం:** గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులు ఉన్నత పదవులు పొందుతారు.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. అనుకోని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు ముందుకు సాగక నిరాశ పరుస్తాయి. నిరుద్యోగులకు రావలసిన అవకాశాలు చేజారుతాయి.





## ఫార్ములా-ఈ కేసులో తొలిసారి కోర్టుకు హాజరైన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. ఫార్ములా-ఈ రేసు నిర్వహణకు సంబంధించి ఏసీబీ మార్చి 23న 77 పేజీల ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. ఇందులో కేటీఆర్, అరవింద్ కుమార్, బి.ఎల్.ఎన్. రెడ్డి, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఖీజూా) సంస్థలను నిందితులుగా పేర్కొంది. కేసులో 14 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలిపింది.

తప్పనిసరిగా పొందాల్సిన ఆర్థిక శాఖ, న్యాయ శాఖ అనుమతులు, అలాగే మంత్రివర్గ ఆమోదం లేకుండానే ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థకు నిధులు విడుదల చేసినట్లు ఏసీబీ ఆరోపించింది. దీనివల్ల హెచ్ఎండీఏకు రూ.54.88 కోట్ల నష్టం వాటిల్లిందని, కుదుర్చుకున్న ఒప్పందాల కారణంగా రాష్ట్ర ఖజానాపై సుమారు రూ.600 కోట్ల మేర ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది.

అలాగే ప్రైవేటు సంస్థ ఏస్ నెక్ట్స్‌జెన్‌కు అనుచిత ప్రయోజనాలు కల్పించడంతో పాటు ప్రతిఫల ఒప్పందం (క్విడ్ ప్రో కో) జరిగినట్లు ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను నిందితులంతా ఖండించారు.

కేటీఆర్‌కు మద్దతుగా మాజీ మంత్రులు పి. సబితా ఇంద్రారెడ్డి, మహ్మద్ మహమూద్ అలీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితర బీఆర్ఎస్ నేతలు కోర్టుకు హాజరయ్యారు.

## హైడ్రాపై వెనక్కి తగ్గేదేలే

### సీఎం రేవంత్ స్పష్టం

హైదరాబాద్, జూలై 31 హైడ్రా (న్ణ=ూాూా)పై తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ వ్యవహారంపై స్పందించిన ఆయన, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కాలువలను ఆక్రమణల నుంచి రక్షించే చర్యలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

ఆక్రమణదారులు చట్టపరమైన పోరాటం పేరుతో ప్రభుత్వ చర్యలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం పేర్కొన్నారు. అయితే చట్టాన్ని గౌరవిస్తూ, న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. హైడ్రా లక్ష్యం ప్రజా ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల సంరక్షణ మాత్రమేనని, ఇందులో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.

హైడ్రా చేపడుతున్న చర్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించిన ముఖ్యమంత్రి, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, ఆ దిశగా హైడ్రా చర్యలు నిరంతరం కొనసాగుతాయని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళి

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 45 నిమిషాలపాటు సీపీఆర్ నిర్వహించి గుండె స్పందనను పునరుద్ధరించినప్పటికీ, మెదడు స్పందన లేకపోవడంతో పరిస్థితి విషమించింది. ఆరు రోజుల పాటు వైద్య బృందం చేసిన తీవ్ర ప్రయత్నాలు ఫలించక ఆయన తుదిశ్వాస విడిచారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి 1974 ఆగస్టు 6న వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నల్లబెల్లి గ్రామంలో రాజిరెడ్డి, అమృతమ్మ దంపతులకు జన్మించారు. రైతు కుటుంబానికి చెందిన ఆయన 1991లో వరంగల్‌లోని మహబూబియా పంజతన్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆయన భార్య స్వప్న. కుమారుడు నిధర్శన్ రెడ్డి, కుమార్తె ధర్మిష్ఠ రెడ్డి ఉన్నారు.

సుదర్శన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం యువజన కాంగ్రెస్‌తో ప్రారంభమైంది. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావ సమయంలో ఆ పార్టీలో చేరారు. నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికై జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా సేవలందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ ప్రాంతంలో నిర్వహించిన సభలు, భారీ ర్యాలీల్లో చురుకుగా పాల్గొని కీలక పాత్ర పోషించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఆయన, పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను అంకితభావంతో నిర్వహించిన నాయకుడిగా పేరు సంపాదించారు.

2014 అసెంబ్లీ ఎన్నికల్లో నర్సంపేట నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన ఆయన, 2018 ఎన్నికల్లో ఘన విజయం సాధించి నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018--2023 మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా, శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు: కేసీఆర్

హైదరాబాద్, జూలై 31 మాజీ నర్సంపేట ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన రెండో దశ ఉద్యమంలో, ముఖ్యంగా వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి పనిచేసిన రోజుల్ని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు పార్టీ చేసిన ప్రయత్నాలు, వైద్యులు చేసిన శ్రమ ఫలించకపోవడం తీవ్ర బాధ కలిగించిందని పేర్కొన్నారు. నిజాయితీ, నిబద్ధతతో కూడిన రాజకీయ ప్రస్థానం సాగించిన పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. తెలంగాణనే ఊపిరిగా భావించి ప్రజల కోసం పనిచేసిన నాయకుడిగా ఆయన నిలిచిపోయారని అన్నారు. పోరాటాల గడ్డగా పేరొందిన నర్సంపేటలో బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, ఉద్యమం నుంచి చివరి శ్వాస వరకు పార్టీ సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేసిన ధైర్యవంతుడైన నాయకుడిగా సుదర్శన్ రెడ్డి గుర్తుండిపోతారని కేసీఆర్ తెలిపారు. ఉద్యమంలోనూ, నియోజకవర్గ అభివృద్ధిలోనూ ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. పార్టీకి అత్యంత విధేయుడిగా సేవలందించిన పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటని కేసీఆర్ పేర్కొన్నారు. పోలీసు ఒత్తిళ్లు, బెయిల్ లేని కేసులు, జైలు జీవితం వంటి ఎన్నో కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన ఆయన సేవలు పార్టీ శ్రేణులు, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా ఆయన భార్య, పిల్లలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు.

## నేడు ఏపీకి ప్రధాని మోదీ రాక

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించింది. భోగాపురం నుంచి మైసూరు వెళ్లనున్న ప్రధాని స్వామి వివేకానంద సాంస్కృతిక యువ కేంద్రం వివేక స్మారకను ప్రారంభిస్తారని ప్రధానమంత్రి కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. 48 గంటల పాటు 'నో ఫ్లయింగ్ జోన్' : మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విమానాశ్రయం పరిసరాలను 48 గంటల పాటు 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటిస్తూ కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఎయిర్‌పోర్ట్, సభా వేదిక, హెలిప్యాడ్ పరిసరాల చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో గురువారం రాత్రి ఎనిమిది నుంచి శనివారం రాత్రి ఎనిమిది గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని చెప్పారు. డ్రోన్లు, మానవరహిత విమానాలు, పారా-గ్లైడర్స్, మైక్రో-లైట్‌ఎయిర్‌క్రాఫ్ట్‌లు తదితర వాటిపై నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు.

## టామ్‌కాం ద్వారా ఉపాధి.. పాస్‌పోర్టు సేవలు

(మొదటి పేజీ తరువాయి)

విదేశీ భాషల బోధనకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, అవసరమైతే ఆయా దేశాలకు చెందిన శిక్షకులను నియమించాలని సూచించారు.

ఉన్నత విద్యకు అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల మాదిరిగానే బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందే యువతకు కూడా స్కాలర్‌షిప్‌లు అందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే యూనివర్సిటీ ప్రాంగణంలో రీలోకేటెడ్ చెట్లను నాటాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని సీఎం అన్నారు. చదువుతో పాటు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా స్టైఫండ్‌తో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా అలవడతాయని చెప్పారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) సర్వీసింగ్ వంటి అత్యాధునిక కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా నర్సింగ్ కళాశాలల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ఉద్యోగుల ఆరోగ్య ట్రస్ట్‌ను మరింత బలోపేతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. ట్రస్ట్ కార్యకలాపాల సమర్థ నిర్వహణ కోసం కార్యనిర్వాహక కమిటీతో పాటు అవసరమైన ఉపకమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలు చికిత్స ప్యాకేజీ రేట్లు, ఆస్పత్రుల ఎంపిక, సేవల నాణ్యత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను నిరంతరం సమీక్షించి ట్రస్ట్‌కు సిఫారసులు చేయనున్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అవసరమైన ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే వైద్య సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఇందుకోసం 24 గంటల సహాయ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, ఎంపానెల్ ఆస్పత్రులతో మెరుగైన సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా ట్రస్ట్ పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని సంజయ్ జాజు అధికారులకు స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల









### జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం

### అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా

### ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలి -

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ

**విజయవాడ: జూలై 31,2026:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ (Special Intensive Revision--SIR--2026) కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ శుక్రవారం విజయవాడ కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అధికారికంగా విడుదల చేశారు.

**జిల్లాలో 15.89 లక్షల మంది ఓటర్లు నమోదు**

ముసాయిదా ఓటర్ల జాబితా–2026 ప్రకారం జిల్లా జనాభా 24,45,334 కాగా, మొత్తం 15,89,731 మంది ఓటర్లు నమోదయ్యారు. వారిలో 7,71,648 మంది పురుషులు, 8,17,936 మంది మహిళలు, 147 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే అధికంగా నమోదవడం విశేషం. స్త్రీ–పురుష నిష్పత్తి 1060 కాగా, ప్రతి వెయ్యి మంది జనాభాకు 650 మంది ఓటర్లు ఉన్నారు.

**పిడబ్ల్యూడీ, సర్వీస్ ఓటర్ల వివరాలు**

జిల్లాలో 13,755 మంది దివ్యాంగ (PwD) ఓటర్లు నమోదయ్యారు. అలాగే 367 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా, వారిలో 337 మంది పురుషులు, 30 మంది మహిళలు ఉన్నారు.

**1936 పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా జాబితా అందుబాటులో**

ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారుల (ERO) కార్యాలయాలు, సహాయ ఎన్నికల నమోదు అధికారుల (AERO) కార్యాలయాలు, అలాగే 1,936 పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచారు.

**క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు నెల రోజుల గడువు**

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ముసాయిదా జాబితాలో పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు అవసరమైతే జూలై 31 నుంచి ఆగస్టు 30, 2026 వరకు సంబంధిత బూత్ లెవల్ అధికారి (BLO), తహశీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి (AERO), ఎన్నికల నమోదు అధికారి (ERO) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కారం సెప్టెంబర్ 28 వరకు**

సవరణల ప్రక్రియలో భాగంగా జూలై 31 నుంచి సెప్టెంబర్ 28, 2026 వరకు నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన, విచారణ, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

**అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా**

అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కారం అనంతరం 2026 అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా అధికారికంగా ప్రచురించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

**18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి**

18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం–6తో పాటు ూఅఅవఞబతీవ-ఱ సమర్పించి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో అవసరమైన వివరాలు సమర్పించని వారు లేదా సమర్పించిన వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోపు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు.

గుర్తింపు కోసం 11 రకాల చెల్లుబాటయ్యే పత్రాలు

ఓటరు నమోదు లేదా వివరాల ధృవీకరణ కోసం క్రింది పత్రాల్లో ఏదైనా సమర్పించవచ్చు.

ప్రభుత్వం/పీఎస్‌యూ ఉద్యోగి లేదా పింఛనుదారుల ఐడీ / PPO

01–07–1987కు ముందు ప్రభుత్వం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రం

జనన ధ్రువీకరణ పత్రం

పాస్‌పోర్ట్

మెట్రిక్యులేషన్ లేదా విద్యా ధ్రువపత్రం

శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం (PRC)

అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం

OBC / SC / ST కుల ధ్రువీకరణ పత్రం

NRC (వర్తించే ప్రాంతాల్లో)

కుటుంబ రిజిస్టర్

ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రం

నియోజకవర్గాల వారీగా సాధారణ ఓటర్లు

తిరువూరు (ఎస్సీ): 1,95,574 మంది (పురుషులు -- 96,252, మహిళలు -- 99,316, థర్డ్ జెండర్ -- 6)

విజయవాడ పశ్చిమ: 2,35,721 మంది (పురుషులు -- 1,15,786, మహిళలు -- 1,19,902, థర్డ్ జెండర్ -- 33)

విజయవాడ సెంట్రల్: 2,59,092 మంది (పురుషులు -- 1,25,076, మహిళలు -- 1,33,967, థర్డ్ జెండర్ -- 49)

విజయవాడ తూర్పు: 2,49,985 మంది (పురుషులు -- 1,21,442, మహిళలు -- 1,28,522, థర్డ్ జెండర్ -- 21)

మైలవరం: 2,64,459 మంది (పురుషులు -- 1,27,737, మహిళలు -- 1,36,702, థర్డ్ జెండర్ -- 20) --- జిల్లాలో అత్యధిక ఓటర్లు నమోదైన నియోజకవర్గం.

నందిగామ (ఎస్సీ): 1,91,709 మంది (పురుషులు -- 92,883, మహిళలు -- 98,818, థర్డ్ జెండర్ -- 8)

జగ్గయ్యపేట: 1,93,191 మంది (పురుషులు -- 92,472, మహిళలు -- 1,00,709, థర్డ్ జెండర్ -- 10)

**నియోజకవర్గాల వారీగా సర్వీస్ ఓటర్లు**

తిరువూరు (ఎస్సీ) -- 48 మంది

విజయవాడ పశ్చిమ -- 58 మంది

విజయవాడ సెంట్రల్ -- 67 మంది (జిల్లాలో అత్యధికం)

విజయవాడ తూర్పు -- 60 మంది

మైలవరం -- 43 మంది

నందిగామ (ఎస్సీ) -- 41 మంది

జగ్గయ్యపేట -- 50 మంది

ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా, తప్పులులేకుండా రూపొందించడమే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. భారత ఎన్నికల సంఘం 09–09–2025 తేదీ No.23/2025-ERS/Vol.II ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి**

ప్రతి ఓటరు ముసాయిదా జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, అవసరమైన సవరణలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పాల్గొని జిల్లాకు పూర్తిస్థాయి, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొంది ంచేందుకు సహకరించా లని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, బిజెపి ప్రతినిధిలు కె.గణేష్, పి.సురేష్ బాబు, బీఎస్పీ ఏ.పవన్ కుమార్, టిడిపి ప్రతినిధి వై.రామయ్య, వైయస్సార్సీపి ప్రతినిధి వై.ఆంజనేయ రెడ్డి, జెఎస్పి ప్రతినిధి జె.శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల సెక్షన్ డిప్యూటీ తహసిల్దార్లు అనూష్ కుమార్, రెడ్డి పాల్గొన్నారు.

---

# కలెక్టర్ (పౌరసరఫరాలు) వారి కార్యాలయము,



**జిల్లా, విజయవాడ, ది.31.07.2026:** ఇటీవల కొద్ది రోజులుగా బియ్యం ధరలు పెరుగుతున్న నేపధ్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. గత నెలతో పోలిస్తే ప్రస్తుతం బియ్యం ధరలు బిపిటి మరియు సోనామసురి రకాలు క్వింటాలుకు 1000 రూపాయల నుండి 1400 వరకు, హెచ్.ఎం.టి రకం క్వింటాలుకు 1100 వరకు పెరుగుదలను గుర్తించిన ప్రభుత్వం గౌరవ రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మరియు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ కమీషనర్ శ్రీ కన్నబాబు నేతృత్వంలో తేదీ: 23 .07.2026 న ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో వివిధ రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్ మరియు రైస్ ట్రేడర్స్ తో సమావేశం నిర్వహించి బియ్యం ధరలను సమీక్షించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆగష్టు 1 వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ ల ద్వారా రైతు బజార్లు మరియు ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ కేంద్రాల ద్వారా దీుడ ఖచీవీ స్టీమ్ రైస్ కిలో 52 రూపాయల చొప్పున, రా రైస్ కిలో 50 రూపాయల చొప్పున విక్రయించాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 130 రైతు బజార్లు మరియు 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక పాయింట్లలో ఈ అమ్మకాలు జరుగుతాయి. ఈ విషయమై అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్స్, జిల్లా పౌరసరఫరాల అధికారులు , జిల్లా మేనేజర్లు మరియు రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్ వారితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి కౌంటర్ల ఏర్పాటు గురించి చర్చించారు. మన ఎన్టిఆర్ జిల్లాలో ఉన్న 14 రైతు బజార్లలో మరియు 30 రైస్ మిల్స్ నందు కౌంటర్లు ఏర్పాటు కాబోతున్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ వారు తెలియచేసినారు . ఈ కౌంటర్లకు రైస్ ఏపి మిల్లుల నుండి సరఫరా చేయాలి మరియు రైస్ మిల్లర్స్ ఎక్కడెక్కడ కౌంటర్స్ ఏర్పాటు చేయాలో నిర్ణయించాలని తెలియచేసినారు. రైతు బజార్లు మరియు ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యంను రేషన్ కార్డు వున్న ప్రతి ఒకరు వినియోగించుకోవచ్చని మరియు కొనుగోలు చేయడానికి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా వారి యొక్క ఆధారు కార్డు ను మరియు ఫోన్ నెంబర్ను విధిగా తీసుకెళ్లవలసినదిగా జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి ఇలాక్కియా ఐ.ఏ.ఎస్ గారు కలెక్టర్ వారి కార్యాలయం లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు , రైస్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా పౌరసరఫరాల కార్యాలయ డి.ఎస్.ఓ, ఏఎస్ఓ లు , పౌరసరఫరాల శాఖ డి.టి. లు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ మరియు వివిధ మండలాల తహసిల్దార్లతో జరిగిన సమావేశంలో తెలియజేశారు. మన జిల్లా లో కూడా నిర్దేశిత తేదీ ఆగష్టు 1 నుండి 14 రైతు బజార్లలో మరియు 30 రైస్ మిల్లర్స్ వారి ప్రత్యేక కౌంటర్లలో బియ్యం విక్రయాలు జరగాలని, వాటిని అధికారులు సమన్వయము చేసుకుని ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేట్లు చూడాలని ఆదేశించారు. తదనుగుణంగా రేపటి నుంచి చీ= జిల్లాలో కూడా ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు జరుగుతాయి.

కలెక్టర్(పౌరసరఫరాలు) వారి తరుపున
చీ= జిల్లా, విజయవాడ.

జిల్లా పౌరసంభందాల అధికారి, చీ= జిల్లా వారికి
వార్తా పత్రికలయందు ప్రచురణార్ధం.

---

## సేవే జీవిత లక్ష్యం.. రాజు పి. పుత్రన్‌కు ఘన నివాళి

రాజు పి.పుత్రన్ దూరదృష్టి కలిగిన సామాజిక పారిశ్రామికవేత్త, మానవతావాది, దాత, సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు. కర్ణాటక రాష్ట్రంలోని ఉడుపిలో జన్మించిన ఆయన, ఆతిథ్య రంగంలో తీవ్రమైన ఆర్థిక కష్టాలను అధిగమించి.. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలలో సమాజాభివృద్ధికి మార్గదర్శకుడిగా ఎదిగారు. ఆయన మరణానంతరం కూడా, గ్రామీణ విద్య, ఆరోగ్య సేవలు, సామాజిక సంక్షేమ రంగాలలో ఆయన ప్రారంభించిన సేవలు స్వావలంబన.. సామాజిక మార్పుకు చిరస్థాయిగా స్ఫూర్తినిస్తున్నాయి. ఇది దివంగత రాజు పి. పుత్రన్‌ను స్మరించుకునే ప్రత్యేకమైన రోజు. జీవిత ప్రారంభంలో ఎన్నో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న ఆయన, ఆ కష్టాలను ఇతరులకు సేవ చేయాలనే జీవితకాల సంకల్పంగా మార్చుకున్నారు. ఉడుపిలో జన్మించిన ఆయన, పేదరికం కారణంగా తన సాధారణ విద్యను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. అయినప్పటికీ.. ఆ పరిస్థితులు ఆయనను నిరుత్సాహపరచలేదు. బదులుగా.. పేద, వెనుకబడిన పిల్లలు ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యకు దూరం కాకూడదనే దృఢ సంకల్పాన్ని ఆయనలో పెంపొందించాయి. అలుపెరగని ఆయన సేవా తపన ఫలితంగా.. 2012లో సరస్వతి ఫౌండేషన్‌ను స్థాపించారు. గత దశాబ్దకాలంగా ఈ సంస్థ విద్యా వేతనాలు, విద్యాసంస్థల్లో రాయితీ అవకాశాలు, వైద్య సహాయం మరియు స్థిరమైన జీవనోపాధి కార్యక్రమాల ద్వారా అనేక మంది జీవితాలను మార్చి సమాజంలో విశేషమైన మార్పును తీసుకొచ్చింది. ఈ ప్రత్యేకమైన రోజున ఆయన చిరస్మరణీయ సేవలకు మా ఘన నివాళిని అర్పిస్తూ.. అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన కలలను కొనసాగించాలని కుటుంబ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. మీరు మమ్మల్ని విడిచి వెళ్లి ఒక సంవత్సరం గడిచింది. అయినప్పటికీ.. మీ ప్రేమ, మీ జ్ఞాపకాలు, మీ మార్గదర్శకత్వం మా ప్రతి రోజులోనూ సజీవంగా ఉన్నాయి. మీ జ్ఞానం మాకు దారి చూపుతోంది. మీ దయ మాకు బలాన్నిస్తోంది. మీ ప్రేమ మా కుటుంబాన్ని ఎప్పటికీ ఒక్కటిగా ఉంచుతోంది. నిజాయితీ, ధైర్యం మరియు నిస్వార్థ ప్రేమ అనే అమూల్యమైన వారసత్వాన్ని మీరు మాకు అందించారు. మీ చిరునవ్వు, మీ ఆప్యాయమైన సలహాలు, మా ఇంటికి మీరు తీసుకొచ్చిన ఆప్యాయత.. అన్నీ ప్రతి రోజూ మాకు ఎంతో గుర్తుకొస్తున్నాయి. మీరు మా హృదయాలలో శాశ్వతంగా జీవిస్తూనే ఉంటారు అని కుటుంబ సభ్యుల నివాళులు అర్పించారు.

## కేవలం రూ.55కే 1000పైగా ఛానళ్లు!

జియో తన ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం కేవలం రూ.55కే ఒక ప్రత్యేక టీవీ వోచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్ ద్వారా తక్కువ ధరలోనే ప్రీమియం లైవ్ టీవీ ఛానళ్లను చూడవచ్చు. అయితే.. ఇది సాధారణ రీచార్జ్ ప్లాన్ కాదు. ఎందుకంటే.. ఈ వోచర్‌ను ఉపయోగించాలంటే ఇప్పటికే యాక్టివ్‌లో ఉన్న ఒక బేస్ ప్రీపెయిడ్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలి. బేస్ ప్లాన్ లేకపోతే ఈ వోచర్ పనిచేయదు. రూ.55 ప్లాన్ వ్యాలిడిటీ 30 రోజులు. అయితే దీని ద్వారా 10ఎంబీ డేటా మాత్రమే లభిస్తుంది. డేటా పరంగా పెద్దగా ఉపయోగం లేకపోయినప్పటికీ.. టీవీ ఛానల్స్ చూడటానికి పనికొస్తుంది. జియోటీవీ యాప్‌లో 1,000కుపైగా లైవ్ టీవీ ఛానళ్లను వీక్షించవచ్చు. ఇందులో జియోస్టార్, సోనీ ఎంటర్‌టైన్‌మెంట్, సన్ టీవీ నెట్‌వర్క్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, ఈటీవీ వంటి ప్రముఖ నెట్‌వర్క్‌లకు చెందిన ఛానల్స్ అందుబాటులో ఉంటాయి. స్టార్ ప్లస్ హెచ్‌డీ, కలర్స్ హెచ్‌డీ, సోనీ సెట్ హెచ్‌డీ, సోనీ సబ్ హెచ్‌డీ వంటి ప్రముఖ ఛానళ్లను కూడా వీక్షించవచ్చు. అయితే జియోస్టార్‌కు చెందిన స్పోర్ట్స్ ఛానళ్లు ఈ ప్లాన్‌లో ఉండవు. తక్కువ ఖర్చుతో మొబైల్‌లో లైవ్ టీవీ చూడాలనుకునే జియో వినియోగదారులకు ఈ రూ.55 ప్లాన్ మంచి ఎంపిక.

కేంద్ర ప్రభుత్వానికి చెందిన యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ సంబంధించిన మై భారత్ ఆధ్వర్యంలో నషాముక్తి యువ కార్యక్రమం జరగనున్నది. కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2 అనగా ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారితో సుమారు పదివేల చోట్ల దాదాపు కోటి మంది యువతతో ఆన్లైన్ మాధ్యమంలో ముచ్చటించనున్నారు. యువత అందరూ కలిసి సామూహికంగా నషాముక్తి ప్రతిజ్ఞ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయవాడలో లోక్ భవన్ లో గౌరవ గవర్నర్ గారితో కలిసి మైభారత్ కార్యకర్తలు నషాముక్తి ప్రతిజ్ఞ చేయనున్నారు. కావున ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని ఆన్లైన్ మాధ్యమంలో వీక్షించి వికసిత్ భారత్ కోసం చేస్తున్న ఈ కార్యక్రమానికి తోడ్పాటు అందించవలసిందిగా జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు.

ఇట్లు
బి ప్రదీప్ కుమార్
జిల్లా యువజన అధికారి
మై భారత్
ఎన్ టి ఆర్ జిల్లా

## జియో రీఛార్జ్: ఇవే 28 రోజుల ప్లాన్లు..

రిలయన్స్ జియో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్లను అందిస్తోంది. తక్కువ డేటా వినియోగదారుల నుంచి భారీగా డేటా ఉపయోగించే వారు, 5జీ యూజర్లు, గేమర్లు, ఓటీటీ ప్రియుల వరకు వేర్వేరు కస్టమర్ల కోసం ప్రత్యేక ప్యాక్‌లు ఉన్నాయి. వీటిలో 28 రోజుల వ్యాలిడిటీతో ఉన్న ప్లాన్ల ధరలు రూ.189 నుంచి రూ.545 వరకు ఉన్నాయి. జియో అధికారిక వెబ్‌సైట్‌లో ప్రస్తుతం 28 రోజుల ప్లాన్లలో రూ.299, రూ.329, రూ.349, రూ.399, రూ.445, రూ.459 తదితర ప్యాక్‌లు కనిపిస్తున్నాయి.

**రూ.189 ప్లాన్**

రూ.189 ప్యాక్‌లో 28 రోజుల పాటు అపరిమిత కాల్స్, 300 ఎస్ఎంఎస్‌లు, మొత్తం 2 జీబీ డేటా లభిస్తుంది. డేటా వినియోగం తక్కువగా ఉండే, ప్రధానంగా కాల్స్ కోసం సిమ్‌ను ఉపయోగించే వారికి ఇది పనికొస్తుంది.

**రూ.299, రూ.329 ప్లాన్లు.. రోజుకు 1.5 జీబీ**

రూ.299 ప్లాన్‌లో 28 రోజుల పాటు రోజుకు 1.5 జీబీ డేటా అంటే మొత్తం 42 జీబీ డేటా లభిస్తుంది. అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా ఉంటాయి. రూ.329 ప్లాన్ కూడా ఇదే విధంగా రోజుకు 1.5 జీబీ డేటాతో వస్తుంది. అయితే ఇందులో జియోసావన్ ప్రో వంటి అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. జియో అధికారిక ప్లాన్ లిస్టులో ఈ రెండు ప్యాక్‌లు ప్రస్తుతం 28 రోజుల వ్యాలిడిటీతో కనిపిస్తున్నాయి.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్ట్ చుక్కాని






### పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

**విశాఖపట్నం, జూలై 31:** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో 'కర్టెన్ రైజర్' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల చేతుల మీదుగా విమానాశ్రయ ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర పర్యాటక రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో రవాణా అనుసంధానత (కనెక్టివిటీ) ఎంతో కీలకమని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అని నామకరణం చేశారని గుర్తుచేస్తూ, ప్రజా ఆకాంక్షలను నెరవేర్చేలా ప్రభుత్వం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. విమానాశ్రయ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతగా సైకత శిల్పంలో "థాంక్స్ ఫార్మర్స్" అని మలచడాన్ని, ఎయిర్‌పోర్ట్ నమూనా శిల్పాన్ని మంత్రి కొనియాడారు. పరిశుభ్రత, పచ్చదనంతో గుర్తింపు పొందిన ఋషికొండ 'బ్లూ ఫ్లాగ్' బీచ్ ఔన్నత్యాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వ్యర్థాలను వేయవద్దని పర్యాటకులకు విజ్ఞప్తి చేశారు. బీచ్ నిరంతర పరిశుభ్రతకు కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ధన్యవాదాలు తెలపడంతో పాటు, అక్కడ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల ప్రయోజనాలు కాపాడే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. అనంతరం, "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు.. మన ఎయిర్‌పోర్ట్ మన భవిష్యత్" సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగి, సిగ్నేచర్ వాల్‌పై తన సంతకాన్ని తెలుగులో చేశారు. ఈ వేడుకలో చిన్నారుల నృత్య రూపకాలు, గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు పర్యాటకులను విశేషంగా అలరించాయి. విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఉత్తరాంధ్ర టూరిజం అధికారులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, టూరిజం అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ మోహన్, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, జనసేన పార్టీ నాయకులు సందీప్, శ్రీనివాస్, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో స్థానికులు, పర్యాటకులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: బొండా రవితేజ

**విజయవాడ, జూలై 31:** సెంట్రల్ నియోజకవర్గంలోని 60వ డివిజన్ వాంబే కాలనీ (ఎఫ్ బ్లాక్)లో తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బొండా రవితేజ ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం -- రెండేళ్ల నమ్మకం, సంక్షేమం -- అభివృద్ధి" ప్రచార కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా బొండా రవితేజ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్తూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలు, సూచనలను శ్రద్ధగా వింటూ, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, పాలనలో ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించేలా చేయడానికే ఈ కార్యక్రమం దోహదపడుతోందని ఆయన తెలిపారు. శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రవితేజ స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే 'ప్రజా దర్బార్' ద్వారా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు, ఎమ్మెల్యే సొంత నిధులతో పేదలకు జీవనోపాధి పరికరాలు, విద్యా-వైద్య సహాయం, ఉచిత భరోసాతో వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. ప్రజాసేవే ధ్యేయంగా కూటమి పాలన ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబానికి ఇంటిపై పూర్తి హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ, జూలై 31:** సెంట్రల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ గిరిపురంలో "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" పేరుతో 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నిర్వహించారు. గిరిపురం గాస్పెల్ పాల్ చర్చ్ వద్ద ప్రారంభమైన ఈ ప్రచారంలో ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమం, వేగవంతమైన అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు ఇళ్లపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. గత 30, 40 ఏళ్లుగా నివసిస్తూ పట్టాలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాల సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక జీవో జారీ చేయించామని బొండా ఉమ గుర్తుచేశారు. నియోజకవర్గంలోని ఓల్డ్ గిరిపురం, న్యూ గిరిపురం, కస్తూరిబాయిపేట, అంబేద్కర్ కాలనీ, సుందరయ్య నగర్ వంటి అనేక ప్రాంతాల్లో భూ సమస్యాత్మక వర్గీకరణల వల్ల నిలిచిపోయిన దాదాపు 2,578 కుటుంబాల ఇళ్లకు దశలవారీగా ఉచిత రిజిస్ట్రేషన్లు చేయించి శాశ్వత హక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమానికి పూర్తి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, డివిజన్ ప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



**నరసరావుపేట, జూలై 31:** పల్నాడు జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కృతిక శుక్లా శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించి, ఈఆర్ఓలకు ప్రతులను పంపిణీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ జాబితాను ప్రచురించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15,49,802 మంది ఓటర్లు ఉండగా.. అందులో 7,58,339 మంది పురుషులు, 7,91,312 మంది మహిళలు, 151 మంది ట్రాన్స్‌జెండర్లు, 1,195 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ప్రత్యేక పరిశీలనలో భాగంగా ఆచూకీ లేకపోవడం, శాశ్వతంగా వలస వెళ్లడం, మరణించడం మరియు డబుల్ ఓట్లు వంటి కారణాలతో ఏఎస్‌డీడీ కేటగిరీ కింద 1,91,996 మంది ఓటర్లను జాబితా నుండి తొలగించినట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితాపై మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉన్నవారు జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు సంబంధిత బీఎల్ఓ, తహసీల్దార్ లేదా ఈఆర్ఓ కార్యాలయాల్లో దర ఖాస్తులు సమర్పించవచ్చని కలెక్టర్ సూచించారు. 18 ఏళ్లు నిండిన అర్హులు ఫారం-6, అనెక్సర్-డి ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల పరిశీలనలో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తామని, వారు నిర్ణీత వ్యవధిలో ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రతి ఓటరు తమ వివరాలను సరి చూసుకుని పారదర్శక జాబితా రూప కల్పనకు సహకరించాలని కోరారు. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 3న ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ అద్దయ్య, ఎన్నికల శాఖ అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడిపిన డ్రైవర్‌పై వేటు

### హెచ్చరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అన్నమయ్య జిల్లా, జూలై 31:** ఆర్టీసీ బస్సు నడుపుతూ సెల్‌ఫోన్ ఉపయోగించిన డ్రైవర్‌పై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాలతో అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. పాలమనేరు--మదనపల్లె మార్గంలో విధులు నిర్వహిస్తున్న పాలమనేరు డిపోకు చెందిన హైర్ సర్వీస్ బస్సు (AP39 UY 9691) డ్రైవర్ కె. గణేష్ కుమార్ సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడుపుతుండగా ఓ ప్రయాణికుడు వీడియో తీసి అధికారులకు పంపించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో, డిపో మేనేజర్ సదరు డ్రైవర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోవని, డ్రైవింగ్ సమయంలో సెూల్‌ఫోన్ వాడకం వంటి నిర్లక్ష్యపూరిత చర్యలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పవని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.



## జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### కలెక్టరేట్ వద్ద ఏపీడబ్ల్యూజెఎఫ్ నిరసన

**నరసరావుపేట, జూలై 31:** జర్నలిస్టుల డిమాండ్ డే సందర్భంగా రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీడబ్ల్యూజెఎఫ్, ఏపీబీజేఏ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఎన్. ప్రసాదరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, ఆ వాగ్దానాన్ని తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు కారుమంచి వెంకట నరసయ్య, పచ్చవ బుజ్జిబాబు మాట్లాడుతూ వార్తల సేకరణకు వెళ్లే విలేకరులకు రక్షణ కరువైందని, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ పథకం, వెల్ఫేర్ ఫండ్ పునరుద్ధరణ, ఉచిత బీమా, రాయితీ ఏసీ బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం జర్నలిస్టుల బృందం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ)కి, టీడీపీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రాలు అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని డిఆర్ఓ హామీ ఇవ్వగా, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల సమస్యలపై మాట్లాడి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ ఆదాం, షాజహాన్ బాషా, సయ్యద్ సాజిద్, ఎం. చంద్రశేఖర్, బి. శ్రీనివాసరావు, పి. భార్గవ్ రెడ్డి, టి. చిన్నబ్బాయి, పి. బాలు, కె. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్ వివాదం.. కేంద్రం యాక్షన్!

భారత ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొంతసేపు పరిమితం చేసిన ఘటన తర్వాత.. కేంద్ర ప్రభుత్వం మెటా సంస్థపై మరింత దృష్టి పెట్టింది. ఈ వ్యవహారంపై.. మెటా గ్లోబల్ బృందాన్ని భారత్‌కు పిలిపించి.. సంస్థ విధానాలు, కంటెంట్ నియంత్రణ వ్యవస్థలపై వివరణ కోరాలని నిర్ణయించింది. మెటా ప్రతినిధులను ముఖ్యంగా అల్గారిథమ్‌లు ఎలా పనిచేస్తాయి?, వినియోగదారులకు ఏ కంటెంట్ చూపించాలి?, అనే నిర్ణయాలు ఎలా తీసుకుంటారు, కంటెంట్ మోడరేషన్‌లో ఏమైనా పక్షపాతం ఉందా?, అనే అంశాలపై ప్రశ్నించనున్నారు. అంతే కాకుండా.. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ప్రజా శాంతి, సమాజంపై చూపించే ప్రభావం గురించి కూడా చర్చ జరగనుంది. దీంతో.. మెటా గ్లోబల్ బృందం వచ్చే వారం మధ్యలో భారత్‌కు వచ్చే అవకాశం ఉందని, అనంతరం పార్లమెంటరీ కమిటీ ముందు కూడా హాజరుకానుందని సమాచారం. సోషల్ మీడియా సంస్థలు భారతదేశంలో పనిచేస్తున్నప్పుడు.. దేశ చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇటీవల ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి షేర్ చేసిన ఒక ఫేస్‌బుక్ పోస్టును తాత్కాలికంగా పరిమితం చేసింది. ఈ పోస్టులో పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఘటన సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి క్షమాపణలు చెప్పినప్పటికీ, ఈ వివరణపై కేంద్రం సంతృప్తి చెందలేదని సమాచారం.

# అంతర్గత జల రవాణాకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

### కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్

### జల వాహన్ పథకంపై పార్లమెంట్ లో ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు సమాధానం




**న్యూఢిల్లీ, జూలై 31:** దేశంలో అంతర్గత జల రవాణాను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జల్ వాహక్' పథకం పురోగతిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్‌లో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ సమగ్ర సమాధానమిచ్చారు. జలవాహక్ పథకం కింద ఇప్పటివరకు 12 మంది కార్గో యజమానులు నమోదు చేసుకోగా, అందులో ఏడుగురికి ఆమోదం లభించిందని తెలిపారు. అయితే ఇప్పటివరకు కార్గో యజమానుల నుంచి ఎలాంటి క్లెయిమ్‌లు రాకపోవడంతో నిధుల విడుదలకు సంబంధించిన అర్హతలు నమోదు కాలేదని వివరించారు. ప్రస్తుతం జాతీయ జలమార్గం--1 (వారణాసి--కోల్‌కతా), జాతీయ జలమార్గం--2 (కోల్‌కతా--పాండు, గౌహతి) మార్గాల్లో 8 అంతర్గత జల రవాణా నౌకలతో షెడ్యూల్డ్ సేవలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నౌకల సామర్థ్య వినియోగం ఆశాజనకంగా ఉందని, కోల్‌కతా--వారణాసి మార్గంలో సగటున 79.34 శాతం, కోల్‌కతా--పాండు మార్గంలో 71.05 శాతం సామర్థ్యం నమోదైందని చెప్పారు. ప్రయాణ వ్యయాలు కూడా సక్రమంగా నిర్వహించబడుతున్నాయని, టాటా స్టీల్, అల్ట్రాటెక్, బిర్లా వైట్ సిమెంట్ వంటి దిగ్గజ కార్గో సంస్థలు కూడా ఈ వ్యవస్థపై పూర్తి నమ్మకంతో సానుకూలంగా స్పందించాయని వెల్లడించారు. 2025--26 సంవత్సరానికి గానూ జాతీయ జలమార్గాలు--1, 2 లపై లక్ష్యంతో పోలిస్తే ఏకంగా 104.7 శాతం సరుకు రవాణా వృద్ధి నమోదు కావడమే కేంద్ర ప్రభుత్వ చర్యల విజయానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో, పర్యావరణహితంగా సరుకు రవాణాను ప్రోత్సహించడం వల్ల దేశంలో లాజిస్టిక్స్ వ్యయం తగ్గి వాణిజ్య రంగానికి ఊతం లభిస్తోందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లోని జలమార్గాల అభివృద్ధికి, అక్కడి నుంచి సరుకు రవాణా అవకాశాలను విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి వివరించారు.

# మలక్‌పేట్ టీవీ టవర్‌కు కొత్త అవతారం

## ఇంటర్నెట్ లేకుండానే స్మార్ట్‌ఫోన్‌లో ఉచిత టీవీ ఛానళ్లు

**హైదరాబాద్, జూలై 31**

ఒకప్పుడు దూరదర్శన్ ప్రసారాలకు కేంద్రబిందువుగా నిలిచిన హైదరాబాద్‌లోని చారిత్రక మలక్‌పేట్ టీవీ టవర్‌కు కొత్త రూపం దక్కబోతోంది. ప్రస్తుతం ఈ టవర్‌ను డిజిటల్ మొబైల్ బ్రాడ్‌కాస్టింగ్ కేంద్రంగా మార్చేందుకు ప్రయోగాలు జరుగుతున్నాయి. ఇవి విజయవంతమైతే, ఇంటర్నెట్ లేదా ఎలాంటి చందా లేకుండానే స్మార్ట్‌ఫోన్‌లలో ఉచితంగా టీవీ ఛానళ్లను వీక్షించే అవకాశం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం స్టూడియో నుంచి ఉపగ్రహం ద్వారా పంపే ప్రసార సంకేతాలను మలక్‌పేట్ టీవీ టవర్ స్వీకరించి, అక్కడి నుంచి సుమారు 60 కిలోమీటర్ల పరిధిలోని మొబైల్ ఫోన్లకు నేరుగా ప్రసారం చేసే విధానాన్ని పరీక్షిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మొదటి దశలో డీడీ యాదగిరి, డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ స్పోర్ట్స్ వంటి దూరదర్శన్ ఛానళ్లను ఈ సేవ ద్వారా ప్రసారం చేయనున్నారు. ముఖ్యంగా క్రీడా ప్రసారాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో విధాన నిర్ణయం అనంతరం ప్రైవేట్ టీవీ ఛానళ్లను కూడా ఈ వేదికలో చేర్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. దూరదర్శన్ హైదరాబాద్ కేంద్రం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రస్తుతం సాంకేతిక పరీక్షలు కొనసాగుతున్నాయి. అవి విజయవంతమైతే వచ్చే ఏడాదిలో ఈ సేవను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.



# ప్రజల వినతులు స్వీకరించిన మంత్రి

## హైదరాబాద్‌లో ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమావేశం

**హైదరాబాద్, జూలై 31**

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలను కలిసి వారి సమస్యలు, వినతులను స్వీకరించారు. ప్రజలు ప్రస్తావించిన అంశాలను శ్రద్ధగా విని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తమ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజా అవసరాలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిపై సమగ్రంగా చర్చించారు. సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సంబంధించిన ప్రతి అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం ద్వారా సమర్థవంతమైన పరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వినతుల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను ఆలస్యం చేయకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# కేంద్ర మంత్రికి ఈటల వినతి

## గ్రామీణ రహదారులకు అదనపు నిధులు కోరిన బీజేపీ ఎంపీలు

**న్యూఢిల్లీ, జూలై 31**

తెలంగాణకు గ్రామీణ రహదారులు, పేదలకు గృహాల మంజూరులో కేంద్రం మరింత సహకారం అందించాలని బీజేపీ ఎంపీలు కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని గ్రామీణ రహదారులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడేందుకు అదనపు నిధులు కేటాయించాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అర్హులైన పేద కుటుంబాలకు అధిక సంఖ్యలో గృహాలు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈటల రాజేందర్ కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్రానికి అవసరమైన అన్ని విధాలా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావు, గోడం నగేష్, కే. విశ్వేశ్వర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో రాష్ట్రానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ ఎంపీలు కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యార్థుల నిధుల దుర్వినియోగంపై మల్లన్న ఆరోపణలు

## జనగామలో డాక్టర్ భిక్షపతిని టీఆర్‌పీ తొలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన మల్లన్న

**జనగామ, జూలై 31**

విద్యార్థుల సంక్షేమ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో విఫలమైందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. జనగామ జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం, యూత్ అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ--బహుజన విద్యార్థి, యువ చైతన్య సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. మహిళా విద్యార్థుల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన శానిటరీ ప్యాడ్ల పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని, ఇందుకోసం కేటాయించిన రూ.74 కోట్ల నిధుల వినియోగంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్ నిధుల్లో కొంత మొత్తమే విడుదల చేసి, మిగిలిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని ఆరోపించారు. హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు తగిన ఆర్థిక సహాయం అందడం లేదని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పుడు ప్రకటనలతో విద్యార్థులు, తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించిన మల్లన్న, విద్య హక్కు చట్టం--2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కల్పించాల్సిన 25 శాతం ఉచిత సీట్లను ప్రభుత్వం అమలు



చేయడం లేదని ఆరోపించారు. విద్యారంగానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, దీంతో విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని అన్నారు. జనగామ నియోజకవర్గంలో విద్యా వ్యాపారుల ఆధిపత్యం పెరిగిందని విమర్శిస్తూ, ప్రజలు మార్పు కోసం ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున జనగామ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ భిక్షపతిని అధికారికంగా ప్రకటించారు. సైన్యంలో 20 సంవత్సరాలు సేవలందించిన ఆయనను గెలిపిస్తే పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందేలా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణలో కూడా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందే వరకు టీఆర్‌పీ పోరాటం కొనసాగుతుందని పేర్కొంటూ, పార్టీ ఎన్నికల గుర్తు లిలి"కత్తెర"లిలికు మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### పార్టీ జెండాల ఆవిష్కరణ

సభ అనంతరం జనగామ పట్టణంలోని 5వ, 13వ వార్డుల్లో పార్టీ జెండాలను తీన్మార్ మల్లన్న ఆవిష్కరించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, మహిళా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పుష్పలీల, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మహిళ, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తప్పుడు దారిలో ప్రయాణం ప్రాణాంతకం

**తప్పు దిశలో వాహనం నడపొద్దని తెలంగాణ పోలీసుల హెచ్చరిక**

**ఎదురెదురుగా ఢీకొనే ప్రమాదాలు పెరిగే అవకాశం**

**కొన్ని నిమిషాలు ఆదా చేయాలనే ఆలోచనే ప్రమాదాలకు కారణం**

**రహదారి నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, జూలై 31**

తప్పుడు దిశలో వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విడుదల చేసిన ప్రత్యేక ప్రచార చిత్రంలో తప్పు మార్గంలో ప్రయాణించడం ఎంత ప్రమాదకరమో వివరించారు. తప్పుడు దిశలో వాహనం నడపడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలతో ఢీకొనే ప్రమాదం అధికంగా ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు తీవ్ర ప్రాణనష్టంతో పాటు శాశ్వత గాయాలకు కూడా దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. కొన్ని నిమిషాలు ఆదా చేసుకోవాలనే ఉ




ద్దేశంతో తప్పు దిశలో ప్రయాణించడం చివరికి జీవితాంతం పశ్చాత్తాపం మిగిల్చే ప్రమాదాలకు కారణమవుతుందని సూచించారు. సమయాన్ని ఆదా చేయాలనే తొందర కంటే ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఎదురుచూస్తుంటారని గుర్తు చేస్తూ, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు కోరారు. సరైన మార్గంలోనే ప్రయాణించి రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తప్పుడు దిశలో వాహనం నడపడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు తెలిపారు. సరైన మార్గంలో ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించి, విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొంటూ "తెలివిగా నడపండి... సురక్షితంగా ప్రయాణించండి... ప్రాణాలను కాపాడండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

# తెలంగాణలో వైన్ టూరిజంపై దృష్టి

**అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అవకాశాల అధ్యయనం**

**హైదరాబాద్, జూలై 31**

తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియా రాష్ట్రంలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని సందర్శించిన మంత్రి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను పరిశీలించారు. సెల్లార్ టూర్‌లో పాల్గొని అంతర్జాతీయ ప్రమాణాలపై అధ్యయనం చేశారు. వర్జీనియాలోని అష్‌బర్న్ ప్రాంతంలోని మరో వైనరీని కూడా సందర్శించిన మంత్రి, ద్రాక్ష సాగు నుంచి వైన్ తయారీ, ప్రాసెసింగ్, కిణ్వ ప్రక్రియ, నిల్వ, సీసాల్లో నింపడం, నాణ్యత ప్రమాణాలు, విక్రయ విధానాలపై వైనరీ ప్రతిని ధులతో చర్చించారు. ద్రాక్ష తోట లను పర్యాటకంతో అనుసంధానించి సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబా ద్ జిల్లాల్లో ద్రాక్ష సాగు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు ద్రాక్ష రైతులకు మెరుగైన ఆదాయం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ రంగం దోహదపడుతుందని పేర్కొన్నారు.



# ఉద్యోగుల ఆరోగ్యంపై సీఎస్ సమీక్ష

**ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను బలోపేతం చేయాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశం**

**చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని సూచన**



**హైదరాబాద్, జూలై 31**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ట్రస్ట్ నిధులను సద్వినియోగం చేసుకునేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించిన ట్రస్ట్ సమావేశంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న చికిత్స ప్యాకేజీ రేట్లను సమగ్రంగా పరిశీలించి, కాలానుగుణంగా వాటిని సమీక్షించాలని సీఎస్ ఆదేశించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా ఆరోగ్య పథకాన్ని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ట్రస్ట్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు అవసరమైన ఉప కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలు చికిత్స ప్యాకేజీ రేట్లు, గుర్తింపు పొందిన ఆసుపత్రులు, వైద్య సేవల నాణ్యత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి ట్రస్ట్‌కు సూచనలు అందించనున్నాయి. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జెండగే హనుమంత్ కొండిబా, పలువురు కార్యదర్శులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొని ఆరోగ్య పథకం అమలుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# లాల్‌దర్వాజాలో శిఖర పూజ

**మహంకాళి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం**

**పూజల్లో పాల్గొన్న నగర సీపీ వీసీ సజ్జనర్**

**2 వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు**

**భక్తులకు సహకరించాలని పోలీసుల విజ్ఞప్తి**



హైదరాబాద్, జూలై 31

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో శుక్రవారం శిఖర పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రతి ఏడాది బోనాల ఉత్సవాల్లో నగర పోలీస్ కమిషనర్ పాల్గొనడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ లాల్‌దర్వాజా మహంకాళి ఆలయానికి 120 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని తెలిపారు. ఆషాఢ మాసంలో జరిగే బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయమని పేర్కొన్నారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని, లాల్‌దర్వాజా బోనాలను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్, రహదారులు--భవనాల శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు సీపీ వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, దక్షిణ మండల పోలీసుల ఆధ్వర్యంలో అదనపు బలగాలను మోహరించి భద్రతను మరింత పటిష్ఠం చేసినట్లు తెలిపారు. బోనాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని సజ్జనర్ చెప్పారు. సుమారు రెండు వేల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈవ్‌టీజింగ్, గొలుసు లాక్కోవడం, జేబుదొంగతనాలు వంటి ఘటనలు జరగకుండా నేర విభాగం, షీ టీమ్స్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని వివరించారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నారని, భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

# ఆవిష్కర్తలతో రాష్ట్రపతి భేటీ

**రాష్ట్రపతి భవన్‌లో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ప్రదర్శన**



న్యూఢిల్లీ, జూలై 31

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అటల్ ఇన్నోవేషన్ మిషన్‌కు చెందిన గ్రామీణ స్థాయి ఆవిష్కర్తలతో రాష్ట్రపతి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రూపొందించిన వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శనలో పరిశీలించి, వాటి పనితీరుపై ఆసక్తిగా తెలుసుకున్నారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణలు సమాజ అవసరాలకు అత్యంత అనుకూలంగా ఉంటాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. స్థానిక అనుభవం, శాస్త్రీయ ఆలోచన, వ్యక్తిగత సృజనాత్మకతతో పాటు సామాజిక బాధ్యత కలిసినప్పుడే ప్రజలకు ఉపయోగపడే వినూత్న పరిష్కారాలు రూపొందుతాయని చెప్పారు. ప్రజల నిత్యజీవిత సమస్యలకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు అందించే సామర్థ్యం గ్రామీణ ఆవిష్కరణలకు ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇటువంటి ఆవిష్కరణలు దేశ అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే తమ లక్ష్యంపై విశ్వాసంతో పనిచేస్తున్న ఆవిష్కర్తలను రాష్ట్రపతి అభినందించారు. వ్యక్తులు, కుటుంబాలు, సమాజ జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పంతో వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన ఆవిష్కర్తలకు ప్రోత్సాహం లభిస్తోందని, కొత్త ఆలోచనలకు తగిన వేదికలు ఏర్పడుతున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. సృజనాత్మకత, పరిశోధన, సామాజిక బాధ్యతల సమన్వయంతో దేశ పురోగతి మరింత వేగవంతం అవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వినూత్న ఆలోచనలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు అందించవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధిలో గ్రామీణ ఆవిష్కర్తల పాత్ర ఎంతో కీలకమని ఆమె స్పష్టం చేశారు.

# స్పీకర్ చేతుల మీదుగా సన్మానం

**వికారాబాద్‌లో పదవీ విరమణ అభినందన సభకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరు**

**ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి సేవలను కొనియాడిన స్పీకర్**



వికారాబాద్, జూలై 31

వికారాబాద్ మండలం సిద్ధలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడిని సన్మానించి ఆయన విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని శాసనసభాపతి పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సేవలందించిన రామకృష్ణారెడ్డి క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచారని అభినందించారు. విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తాయని గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత భావన పెంపొందించడంలో ఉపాధ్యాయుల కృషి అమూల్యమని పేర్కొన్నారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయని, ఇకపై కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు. విద్యా రంగంలో సంపాదించిన అనుభవాన్ని సమాజానికి మార్గదర్శకంగా వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి సేవలను పలువురు విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొని పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఫిష్ క్యాంటీన్‌ను పరిశీలించిన మంత్రి

**మాసబ్‌ట్యాంక్‌లో మత్స్యశాఖ ప్రధాన కార్యాలయానికి తొలి సందర్శన**

**నాణ్యమైన చేపల ఆహారం అందించాలన్న మంత్రి వాకిటి శ్రీహరి**



హైదరాబాద్, జూలై 31

రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సేవలు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర మత్స్యశాఖ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్ క్యాంటీన్‌ను పరిశీలించి నిర్వహణ, పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్యాంటీన్‌లో అందుబాటులో ఉన్న చేపల వంటకాలు, మెనూ వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు అందిస్తున్న సేవలు, చేపల ఆహార నాణ్యత, నిర్వహణ విధానాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన చేపల ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. నాణ్యత ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చేపలు అధిక ప్రోటీన్లు, పోషక విలువలు కలిగిన ఆహారమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో చేపల వినియోగం కీలక పాత్ర పోషిస్తుందని చెబుతూ, ప్రజలు చేపల వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మరింత మంది ప్రజలకు ఫిష్ క్యాంటీన్ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్యాంటీన్ సేవలను విస్తరించడంతో పాటు ఆధునిక సౌకర్యాలతో మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల, అదనపు డైరెక్టర్ మురళీకృష్ణతో పాటు శాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు మత్స్యశాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు.

## కొండాపూర్ ఫెన్సింగ్‌పై హైడ్రా వివరణ

**రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకే చర్యలు చేపట్టినట్లు స్పష్టీకరణ**

హైదరాబాద్, జూలై 31

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సర్వే నంబరు 59లో చేపట్టిన ఫెన్సింగ్ చర్యలపై హైడ్రా వివరణ విడుదల చేసింది. ప్రభుత్వ భూమిని పరిరక్షించాలంటూ రెవెన్యూ అధికారులు చేసిన విజ్ఞప్తి, అందించిన సమాచారం ఆధారంగానే ఫెన్సింగ్ చేపట్టినట్లు పేర్కొంది. ఈ చర్యలు పూర్తిగా రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలోనే జరిగాయని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు ప్రకారం సర్వే నంబరు 59లోని భూమి ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించబడిన నేపథ్యంలో దాదాపు 19 ఎకరాల భూమికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు హైడ్రా తెలిపింది. ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల సమక్షంలో, పోలీసు బందోబస్తు మధ్య ఈ ప్రక్రియ నిర్వహించినట్లు వెల్లడించింది. రెవెన్యూ అధికారులు గుర్తించిన హద్దుల మేరకే ఫెన్సింగ్ చేపట్టామని, హైడ్రా స్వతంత్రంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు తొలగించడంతో పాటు అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను కూడా తొలగించినట్లు తెలిపింది. సర్వే నంబరు 60లోకి హైడ్రా ప్రవేశించలేదని ప్రకటనలో పేర్కొంది. సర్వే నంబరు 60లో తన స్థలానికి చెందిన ప్రహరీని కూల్చివేశారని ఆరోపిస్తూ పి. సుధారాణి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో పలు మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై ఈ వివరణ ఇచ్చినట్లు తెలిపింది. సర్వే నంబరు 60లో తనకు స్థలం ఉందని పేర్కొన్న మహిళ ఆక్రమణలు తొలగించే ముందు గానీ, తర్వాత గానీ హైడ్రాను సంప్రదించలేదని ఎలాంటి ఫిర్యాదు కూడా అందలేదని హైడ్రా వెల్లడించింది.



## దోమలగూడలో మధ్యవర్తిత్వ కేంద్రం

**జీహెచ్ఎంసీ కార్యాలయంలో కేంద్రం ప్రారంభం**

హైదరాబాద్, జూలై 31

ప్రజలకు న్యాయం మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో దోమలగూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో సామాజిక మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ప్రారంభించారు. తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయబడింది. స్థానిక స్థాయిలో చిన్నచిన్న వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. ఈ మధ్యవర్తిత్వ కేంద్రంలో కుటుంబ, పొరుగు, ఆస్తి తదితర చిన్న వివాదాలను ఉచితంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించారు. ఇరుపక్షాల అంగీకారంతో గోప్యంగా, స్వచ్ఛందంగా చర్చలు నిర్వహించి పరస్పర అవగాహనతో వివాదాలను పరిష్కరించే విధానాన్ని అమలు చేయనున్నారు. చిన్న చిన్న సమస్యల కోసం న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన అవసరం తగ్గించి, సామరస్యపూర్వక పరిష్కారాలకు ప్రాధాన్యం ఇవ్వడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రజలకు సులభమైన, వేగవంతమైన న్యాయ సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పడంతో పాటు న్యాయవ్యవస్థపై ఉండే భారం కూడా తగ్గించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని అధికారులు వెల్లడించారు. వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకునే సంస్కృతిని ప్రోత్సహించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

## కావేరిపై అఖిలపక్ష సమావేశం

**రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని కర్ణాటక ప్రభుత్వం**

బెంగళూరు, జూలై 31

కావేరి జలాల అంశంలో కర్ణాటక రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఆగస్టు 2న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విధానసౌధలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. కావేరి జలాల పంపిణీ అంశం రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన విషయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. ఈ అంశంపై సమగ్ర చర్చ జరిపేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. రాష్ట్ర రైతుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టపరంగా, పరిపాలనాపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. విధానసౌధలో జరిగిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి జి. పరమేశ్వర, జలవనరుల శాఖ మంత్రి రామలింగారెడ్డి పాల్గొన్నారు. కావేరి జల వివాదానికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితులపై వారు కూడా చర్చించినట్లు సమాచారం. కావేరి జలాల అంశంపై రాష్ట్ర ప్రజలు, రైతుల ప్రయోజనాలకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పష్టం చేశారు. అఖిలపక్ష సమావేశం అనంతరం తీసుకునే నిర్ణయాలపై తదుపరి కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు.









## 80 రోజుల షూటింగ్..
# 250 రోజుల్లో రిలీజ్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు – రాజమౌళి వారణాసి సినిమా విడుదలపై కొత్త కొత్త ప్రచారాలు తెరపైకి వస్తున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా థియేటర్లో విడుదలవుతుందని మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అయితే అనుకున్న సమయానికి సినిమా రాదని, వాయిదా పడుతుందని సోషల్ మీడియాలో వందతులు వచ్చాయి. వీటన్నింటికీ వారణాసి మూవీటీమ్ చెక్ పెడుతూ శుక్రవారం ఓ పోస్టు షేర్ చేసింది. దీంతో మహేశ్ ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చింది. ముందుగా చెప్పిన ప్రకారమే సినిమా ఏప్రిల్ 7న విడుదల ఉంటుందని స్పష్టం చేస్తూ వారణాసి టీమ్ ఇవాళ కౌంట్‌డౌన్ షురూ చేసింది. ఈ చిత్రం విడుదలకు శుక్రవారం నుంచి సరిగ్గా 250 రోజులు ఉందని సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేసింది. 'వారణాసి రిలీజ్‌కు ఇంకా 250 రోజులు. 2027 ఏప్రిల్ 7' అని పోస్టు చేసింది. కాగా, ఈ సినిమాకు సంబంధించిన 80 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలివుంది. మేజర్ ఐమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన షూటింగ్ ఇటీవలే పూర్తయింది. హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో ఈ సన్నివేశాలను రాజమౌళి తెరకెక్కిస్తున్నారు.

## కార్తీ 'సర్దార్ 2' టీజర్..
# నెక్స్ట్ లెవెల్!

కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో



కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై–స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# రెండో పెళ్లి ఆలోచన లేదు: సురేఖావాణి

టాలీవుడ్ నటి సురేఖావాణి ఒకప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎంతోమంది స్టార్ హీరోలతో నటించి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. అయినప్పటికీ గత కొద్ది కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె తమిళ చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రస్తుతం సురేఖావాణి నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'నిరమ్'. దర్శకుడు కృష్ణ బలరామ్ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో తాన్యా హోప్, ప్రీతి అస్రాని, సురేష్ చక్రవర్తి, శ్రీజిత్ రవి, తిరునావుక్కరసు గజరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కెస్వేర్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో సురేఖావాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె క్లారిటీ ఇచ్చారు. రెండో పెళ్లి గురించి అడగ్గా.. తనకు ఎలాంటి రెండో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని, ఒకవేళ ఆ ఆలోచనే ఉంటే ఇప్పటివరకు ఆగాల్సిన అవసరం ఉండేది కాదని సురేఖావాణి స్పష్టం చేశారు.





## క్యాన్సర్ రోగులకు
# వివేక్ ఒబెరాయ్ భారీ విరాళం

బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'రామాయణ'. ఈ ప్రిస్టీజియస్ ప్రాజెక్టును అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తుండగా.. ఇందులోని పాత్రలకు సైతం భారీ రెమ్యునరేషన్ అందుతున్నట్లు తెలుస్తుంది. అలాంటి భారీ మొత్తంలో వచ్చే రెమ్యునరేషన్ సైతం తనకు వద్దు అని చెప్పాడట బాలీవుడ్ నటుడు వివేక్ ఒబరాయ్. 'రామాయణ'లో వివేక్ ఒబరాయ్ విభీషణుడి పాత్రలో నటిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా కోసం తీసుకోవాల్సిన రెమ్యూనరేషన్‌ను పూర్తిగా క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లల ట్రీట్‌మెంట్ కోసం విరాళంగా ఇవ్వాలని ఫిక్స్ అయ్యాడట. అంతే కాకుండా ఈ విషయాన్ని నిర్మాత నమిత్ మల్హోత్రాకు ముందుగానే తెలిపినట్లు వివేక్ వెల్లడించారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్ కావడంతో నెట్టింట ప్రశంసలు కురిపిస్తున్నారు నెటిజన్లు. అలాగే.. రామాయణంలో విభీషణుడు కేవలం రావణుడి సోదరుడు మాత్రమే కాకుండా, అధర్మం ముందు మౌనంగా నిలబడకుండా ధర్మాన్ని ఎంచుకున్న వ్యక్తి.



ముగెన్ రావ్, ప్రీతి అస్రాని, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'నిరమ్'. ఈ చిత్రాన్ని కె. స్వేర్ సినిమాస్ సమర్పణలో యూనిట్ ఆఫ్ కె స్వేర్ వెంచర్స్ బ్యానర్‌పై కె. బిందుమాధవి నిర్మిస్తున్నారు. సరికొత్త ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ దర్శకుడు బలరామ్ కృష్ణ రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా తాజాగా 'నిరమ్' సినిమా తెలుగు ట్రైలర్, ఆడియో లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ తాన్యా హోప్ మాట్లాడుతూ.. 'మా నిరమ్ మూవీ టీమ్‌తో కలిసి మీ ముందుకు రావడం సంతోషంగా ఉంది. మా సినిమా త్వరలోనే రిలీజ్‌కు రెడీ అవుతోంది. మీరంతా మా సినిమా చూసి ఎంజాయ్ చేయండి. నా క్యారెక్టర్ చాలా సింపుల్‌గా ఉంటుంది. ఒక సాధారణ యువతి తనకు తెలియకుండా ఒక పెద్ద సమస్యలో చిక్కుకుపోతే ఎలా ఇబ్బంది పడుతుంది, ఆ సమస్య నుంచి ఎలా బయటపడుతుంది అనేది నా పాత్రలో చూస్తారు. ఇంట్రెస్టింగ్‌గా వెళ్లే కథలో నేనూ ఒక భాగంగా కనిపిస్తా. ఈ టీమ్‌తో వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది.

## నా క్యారెక్టర్ ఇంట్రెస్టింగ్




## స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?

నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచయం కాబోతున్నారా? అంటే అవునన్న వార్త సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే 'అన్‌స్టాపబుల్' టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## షూటింగ్‌లో రష్మిక గాయాలు.. 6 వారాల రెస్ట్

సినీ నటి రష్మిక మందన్నకు గాయలయ్యాయి. సినిమా షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రస్తుతం ఆమె రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'లో నటిస్తున్నారు. కథానాయిక ప్రాధాన్యమున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపిస్తున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'మైసా'కు సంబంధించి కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు, అండర్ వాటర్ సీక్వెన్స్‌ను ఇటీవల పూర్తి చేశారు. తాజాగా ఈ సినిమాలోని ఓ పాటను షూట్ చేస్తుండగా ప్రమాదం జరిగింది.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467